సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



సామర్థ్యాల మదింపు..

పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషన్ అఛీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నారు.

8లో



ఎస్ఐపీ సోదాలు

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరం, కొవ్వూరు పట్టణంతో పాటు కోనసీమ జిల్లా అమలాపురంలో ఎస్ఐపీ సోదాలు కలకలం రేపాయి.

8లో

మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 2,36,889 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే, తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. భద్రాచలం వద్ద 21.40, కాటన్ బ్యారేజీ వద్ద 10.60 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

జాతి నేతలే మార్గదర్శకులు



గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జాతిపిత మహాత్మాగాంధీ, దేశ రెండో ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి సదా స్మరణీయులని, మనకు మార్గదర్శకులని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఆ జాతి నేతల ఆదర్శాలు, విలువలు, స్ఫూర్తిని యువత అందుకోవాలని అన్నారు. అప్పట్లో రైల్వే మంత్రిగా పని చేసిన సమయంలో జరిగిన రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి రాజీనామా చేసిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు కేఎస్ జ్యోతి, ఎస్.మాధవరావు, జి.పరశురామ్, పి.విజయ భాస్కర్, కలెక్టరేట్ ఏఓ బీవీఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విభాగం ప్రధాన కార్యదర్శిగా హెప్స్టోన్



సాక్షి, రాజమహేంద్రవరం: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ అగస్టీన్ ఇస్సాక్ జాన్ హెప్స్టోన్ పబ్బతి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. ఆవిర్భావం నుంచీ హెప్స్టోన్ వైఎస్సార్ సీపీలో కొనసాగుతున్నారు. వివిధ పదవుల్లో సేవలందించి, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ రాష్ట్ర బాధ్యతలు అప్పగించింది. దీనిపై హెప్స్టోన్ హర్షం వ్యక్తం చేశారు. తనకు ఇంత పెద్ద పదవి ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు.

పోలీసు స్పందనకు ఒకే ఒక్క ఫిర్యాదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎం.రజని హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఒకే ఒక్క ఫిర్యాదు రావడం విశేషం.

ప్రపంచ టెన్నిస్ కప్‌లో సత్తా చాటిన శివాజీ



ప్రపంచ టెన్నిస్ కప్ వేదికపై శివాజీ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): వరల్డ్ డెఫ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన పిల్లా శివాజీ వెండి పతకం సాధించాడు. గత నెల 23న గ్రీస్‌లో ప్రారంభమైన ఈ పోటీల్లో యూత్ సింగిల్స్ విభాగంలో స్పెయిన్ ఆటగాడు కాబో చాపాపై శివాజీ పైచేయి సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. శివాజీని చీఫ్ కోచ్ స్టాలిన్ నాగార్జున, అసిస్టెంట్ కోచ్, ఎండీ వల్లీద్దీన్ అభినందించారు. ప్రపంచ పోటీల్లో శివాజీ వెండి పతకం సాధించడంతో అతడి తల్లిదండ్రులు బాల, రత్నకుమారి ఆనందం వ్యక్తం చేశారు.

గాంధీజీ, శాస్త్రీజీలకు హైకోర్టు న్యాయమూర్తి నివాళి



గాంధీజీ, శాస్త్రీజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న జస్టిస్ గోపాలకృష్ణారావు, ఈఓ ఆజాద్

అన్నవరం: జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం రత్నగిరిపై ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద విశ్రాంతి మండపంలోని వేదికపై గాంధీజీ, శాస్త్రీజీల చిత్రపటాల వద్ద పండితులు పూజలు చేశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణరావు దంపతులు, దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేద పండితులు నీరాజనాలు సమర్పించారు. చివరలో జనగణమన గీతాన్ని దేవస్థానం ఫార్మసీ సూపర్‌వైజర్ వి.మాధవి ఆలపించారు.

స్వగృహప్రవేశం

- జగనన్న కాలనీల్లో విస్తృత ఏర్పాట్లు
- 5న రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల గృహ ప్రవేశాలు
- సామర్లకోటలో ప్రారంభించనున్న సీఎం జగన్
- అదే రోజు కొవ్వూరు మండలం కాపవరంలో కార్యక్రమం
- ప్రారంభించనున్న హోం మంత్రి తానేటి వనిత
- జిల్లా వ్యాప్తంగా 20,337 ఇళ్లలో అడుగు పెట్టనున్న లబ్ధిదారులు



కొవ్వూరు మండలం కాపవరంలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న జగనన్న కాలనీ

సాక్షి, రాజమహేంద్రవరం: పేదల సొంతింటి కల సాకారం దిశగా మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. జగనన్న కాలనీ లబ్ధిదారులను ఈ నెల 5వ తేదీ నాటికి శాశ్వత గృహ యజమానులుగా మార్చేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. సొంతిల్లు అందించడంతో పాటు గృహ ప్రవేశాలు చేపట్టి వారి కుటుంబాల్లో పండగ సంతోషాన్ని సంపూర్ణంగా నింపనుంది. ఇప్పటికే ప్రభుత్వం నిర్దేశించిన వంద శాతం లక్ష్యాన్ని అధిగమించిన అధికారులు గృహ ప్రవేశానికి అవసరమైన ఏర్పాట్లలో తలమునకలవుతున్నారు. ఇళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాలనీల్లో చిన్నచిన్న పనులు పూర్తి చేశారు. మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి గృహ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇల్లు కట్టుకోలేని వారికి అవగాహన కల్పించి, నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూండటంతో ఇల్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు సైతం ముందుకు వస్తున్నారు. పేదలకు శాశ్వత నివాసం కల్పించాలన్న సదుద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 1.46 లక్షల మందికి ఇంటి పట్టాలు ఉచితంగా పంపిణీ చేసింది. తొలి దశలో రూ.113.48 కోట్లతో 63 వేల గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మరికొన్ని వంద శాతం పూర్తి చేసుకుని గృహప్రవేశాలకు ముస్తాబయ్యాయి. మిగిలిన పనులు వేగంగా సాగుతున్నాయి.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 68,519 ఇళ్లు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ప్రతి ఇంటి నిర్మాణం ప్రారంభించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. 64,294 గృహ నిర్మాణ పనులు ప్రారంభించి, 94 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగిలిన 4,225 ప్రారంభించాల్సి ఉంది. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ నాటికి 5 లక్షల గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కాకినాడ జిల్లా సామర్లకోటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నాయి. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 20,337 గృహ ప్రవేశాలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న అధికారులు వంద శాతం సఫలీకృతులయ్యారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమం సామర్లకోటలో జరగనుండగా.. జిల్లా కార్యక్రమం హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా.. కొవ్వూరు మండలం కాపవరంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది సొంతింటి కల సాకారం కానుంది.

వసతుల కల్పనకు ప్రాధాన్యం



కాలనీలో గృహ ప్రవేశానికి ముస్తాబైన ఇల్లు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను లే అవుట్లలో అందుబాటులో ఉంచుతున్నారు. తాగునీటి వసతికి బోర్లు తవ్వుతున్నారు. తాగు, ఇతర అవసరాలకు నీటిని సమకూరుస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయితే ఆ కాలనీల్లో నివసించేందుకు వీలుగా పక్కా ఏర్పాట్లు చేశారు. ఫలితంగా అనపర్తి, బిక్కబోలు, తొర్రేడు, చాగల్లు, కొవ్వూరు కృష్ణారావు చెరువు, కడియం, దామిరెడ్డిపల్లి, నిడదవోలు వైఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లో గృహ నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయి. మరోవైపు జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించే పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 755 కాలనీల్లో రూ.411 కోట్ల అంచనాతో ఈ పనులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో సైతం అధునాతన విధానం అవలంబిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మూడు పెద్ద లే అవుట్లలోని కాలనీల్లో ప్రయోగాత్మకంగా అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరాకు కార్యాచరణ సిద్ధమైంది. కాకినాడ జిల్లా కొమరగిరి, వాకలపూడి, తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబంద జగనన్న కాలనీలను ఇందుకు ఎంపిక చేశారు.

జిల్లాలో గృహ ప్రవేశాలు ఇలా..

మండలం	గృహ ప్రవేశాలు
బిక్కవోలు	838
రంగంపేట	1,490
చాగల్లు	1,500
రాజానగరం	2,057
కొవ్వూరు అర్బన్	950
దేవరపల్లి	125
నల్లజర్ల	20
అనపర్తి	686
గోకవరం	232
గోపాలపురం	57
కడియం	853
కొవ్వూరు	1,459
నిడదవోలు	1,400
నిడదవోలు (అర్బన్)	1,186
పెరవలి	1,455
రాజమహేంద్రవరం అర్బన్	1,683
రాజమహేంద్రవరం రూరల్	743
సీతానగరం	519
తాళ్లపూడి	541
ఉండ్రాజవరం	1,637
కోరుకొండ	906

సర్వాంగ సుందరంగా..



జగనన్న కాలనీల్లో ఇళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. అన్ని రకాల వసతులూ కల్పించాం. జిల్లా వ్యాప్తంగా 20,337 గృహప్రవేశాలు నిర్వహిస్తున్నాం. లక్ష్యాన్ని అధిగమించేందుకు నిత్యం సమీక్షలు నిర్వహించి, అధికారులకు దిశానిర్దేశం చేశాం. ప్రతి శనివారం క్షేత్ర స్థాయి పర్యటనలో లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతున్నాం. ఏవైనా సమస్యలుంటే చెప్పాలని కోరుతున్నాం. ఇల్లు కట్టుకుంటే సకాలంలో బిల్లు వస్తుందని, ఎలాంటి ఆందోళనా వద్దని లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన ఇళ్లకు విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నాం. – కె.మాధవీలత, కలెక్టర్

సర్వం సిద్ధం



జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల గృహప్రవేశాలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. ఇందుకోసం జిల్లాలోని కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో సర్వం సిద్ధం చేశాం. రాష్ట్ర స్థాయి కార్యక్రమం సీఎం చేపట్టనుండగా.. జిల్లా స్థాయి కార్యక్రమానికి హోం మంత్రి తానేటి వనిత హాజరు కానున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి వారం హౌసింగ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తూ, లబ్ధిదారుల్లో చైతన్యం కల్పించడంతో లక్ష్యాన్ని సులువుగా సాధించగలిగాం.

– జి.పరశురాం, హౌసింగ్ పీడీ

రత్నగిరిపై భక్తుల రద్దీ

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం సోమవారం కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు అన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. వ్రతాలు 2,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో ఆవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ పర్యవేక్షించారు.

మంగళవాయిద్యాల కళాకారులకు శిక్షణ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో మంగళవాయిద్యాలు వాయించే కళాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ ఇప్పించనున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం తెలిపారు. సింహాచలంలోని మంగళవాయిద్యాల శిక్షణ స్కూల్‌లో వారికి శిక్షణ ఇస్తారన్నారు. చైర్మన్ ఐవీ రోహిత్‌తో కలిసి ఆయన సోమవారం దేవస్థానం కళాకారుల మంగళవాయిద్యాలను, వారు వాయించే తీరును పరిశీలించారు. ప్లాస్టిక్ డప్పులు వాడ వద్దని, చర్మంతో తయారు చేసినవే వాడాలని సూచించారు. సత్యదేవుని వైదిక కార్యక్రమాల్లో వాయించే ధ్వనులను రికార్డు చేసి, సింహాచలంలోని మంగళవాయిద్యాల శిక్షణ స్కూల్‌కు పంపించాలని ఆదేశించారు. ఆ స్కూల్ అధ్యాపకులు వాటిని పరిశీలించిన తరువాత ఇచ్చే నివేదిక ఆధారంగా దేవస్థానం కళాకారులకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

టీడీపీ నేతల బుద్ధి మార్చు మహాత్మా!

- చంద్రబాబు దీక్షకు నిరసనగా వైఎస్సార్ సీపీ ర్యాలీ
- పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, పార్టీ శ్రేణులు



గాంధీజీ విగ్రహానికి ఎంపీ భరత్ రామ్, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి తదితరుల నివాళి



ర్యాలీలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: జాతిపిత మహాత్మా గాంధీ అహింసా మార్గంలో.. ఎన్నో కష్టాలు పడి పరదేశీయుల చెర నుంచి భరత మాతకు విముక్తి కల్పిస్తే.. నేడు చంద్రబాబు, లోకేష్ వంటి దొంగలు నేతల ముసుగులో ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి నిరాహార దీక్షకు నిరసనగా గాంధీ జయంతి సందర్భంగా కంబాల చెరువు సెంటర్ గాంధీ విగ్రహం నుంచి దండి మార్చ్ విగ్రహాల వరకూ సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ, నాడు భారత ప్రజల విముక్తి కోసం గాంధీజీ సత్యాగ్రహ దీక్షలు చేస్తే.. నేడు అవినీతి సొమ్మును కాపాడుకునేందుకు స్కామ్‌ల బాబు దొంగ దీక్షలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గాంధీజీ కష్టపడి స్వరాజ్యం సాధిస్తే.. టీడీపీ నేతలు ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి అడ్డంగా లక్షల కోట్ల రూపాయలు దిగమింగారని అన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పేరుతో చంద్రబాబు రూ.370 కోట్లు దారి మళ్లించి తనన ఇంటికి రప్పించుకున్నారనే ఆరోపణపై సీఐడీ అరెస్టు చేస్తే.. ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిందని అన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు, బయట భువనేశ్వరి, ఢిల్లీలో వారి కుమారుడు లోకేష్ ఎందుకు దీక్షలు చేస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అడ్డంగా కొల్లగొడితే అణా పైసలతో సహా కక్కించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని చెప్పారు. స్కిల్ స్కామ్ కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని టీడీపీ నేతలు అనడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'మహాత్మా మన్నించు. శాంతియుతంగా ఆందోళనలు నిర్వహించి ఈ స్వరాజ్యాన్ని మాకు అప్పజెప్పినా.. చంద్రబాబు చేసిన దగాకోరు పాలన కారణంగా ప్రజలు తీవ్రంగా నష్టపోయారు' అని పేర్కొంటూ గాంధీజీ విగ్రహానికి ఎంపీ భరత్ వినతి పత్రం సమర్పించారు. తన హెరిటేజ్ కంపెనీలో 2 శాతం వాటాలు విక్రయిస్తే రూ.400 కోట్లు వస్తాయని భువనేశ్వరి చెప్పారని.. ఇన్ని లక్షల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేస్తేనే చంద్రబాబుకు వచ్చాయని అన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అన్ని పనులపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తే లక్షల కోట్ల భారీ స్కామ్‌లన్నీ బయటపడతాయని ఎంపీ భరత్ చెప్పారు. వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, చంద్రబాబు పబ్లిసిటీ కోసం గోదావరి పుష్కరాల్లో 29 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఆ పాపం ఊరికే పోదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

నిధులు దండిగా.. సురక్ష పండగ

- జగనన్న ఆరోగ్య సురక్షకు నిధుల విడుదల
- పట్టణాల్లో శిబిరానికి రూ.లక్ష
- పల్లెల్లో రూ.40 వేలు
- ఉమ్మడి జిల్లాకు రూ.4.50 కోట్ల పైనే బడ్జెట్



కాకినాడ జిల్లా కరప వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రజలకు వారి గుమ్మం ముంగిటనే వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్షను ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపడుతోంది. ఏదైనా సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టి.. ప్రచారానికి వాడుకుని.. గాలికొదిలేసిన గత పాలకులకు భిన్నంగా.. చేపట్టిన ఏ కార్యక్రమమైనా పక్కాగా అమలు చేయాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన అజెండా. ఈ క్రమంలోనే 45 రోజుల పాటు నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. క్షేత్ర స్థాయిలో ఈ కార్యక్రమం ఎటువంటి ఒడుదొడుకులూ లేకుండా అమలయ్యేందుకు బడ్జెట్ కూడా విడుదల చేసింది. దీనిపై అధికార యంత్రాంగం సంతోషం వ్యక్తం చేస్తోంది.

రూ.కోటి నుంచి రూ.కోటిన్నర వరకూ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ నగరపాలక సంస్థలతో పాటు మున్సిపల్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఒక్కో శిబిరానికి రూ.1,00,000, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే శిబిరానికి రూ.40 వేల వంతున బడ్జెట్ విడుదలైంది. నగరాలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాల్లో ఎంపీడీఓలకు ఈ నిధులను విడుదల చేసింది. ఇలా జిల్లాకు సుమారు రూ.కోటి నుంచి రూ.కోటిన్నర చొప్పున ఉమ్మడి తూర్పు గోదావరికి సుమారు రూ.4.50 కోట్లపైనే కేటాయించారు. ఏ ఒక్కరికీ వైద్య సేవలు అందలేదనే మాట రాకుండా ప్రభుత్వం నిధులు కేటాయించింది. షామియానాల ఏర్పాటు దగ్గర నుంచి వైద్యులు సహా సిబ్బంది భోజనాల వరకూ అన్నింటికీ నిధులు విడుదల చేసింది. ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగం క్షేత్ర స్థాయిలో ఉత్సాహంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్లు ఎక్కడికక్కడ క్షేత్ర స్థాయికి వెళ్లి ఈ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.

తొలి రోజు 23,169 మందికి సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. తొలి రోజే ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలి రోజున 23,169 మందికి వైద్య సేవలు అందించారు. అత్యధికంగా తూర్పు గోదావరి జిల్లాలో 8,536 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అక్కడికక్కడే ఉచితంగా పంపిణీ చేశారు. ముందుగానే నిర్వహించిన సర్వేలతో ఏఎన్ఎంల యాప్‌లోకి వచ్చే వివరాలకు అనుగుణంగా వైద్య పరీక్షలు సులువుగా నిర్వహించారు. వైద్య సేవలు, మందులు వేగంగా అందడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి ఒకేచోట వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు, వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ తదితర సంచార వైద్య సేవలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తూండటం విశేషం. ఇన్ని రకాల వైద్య సేవలను నిపుణులైన వైద్యులు గుమ్మం ముంగిటకే వచ్చి అందిస్తూండటం మునుపెన్నడూ చూడలేదని ప్రధానంగా పల్లె ప్రజలు సంబరపడుతున్నారు. వైద్య శిబిరాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి వైద్యసేవలందుకుంటున్నారు. ఒక్కో శిబిరానికి ఐదారు వందల మంది వస్తున్నారు. అవసరమైన వారికి రిఫరల్ వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ ద్వారా ఆరోగ్య ఆసరా అందిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 105 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేస్తూండటం విశేషంగా చెబుతున్నారు. రెండు రోజుల పాటు సెలవుల కారణంగా ఆది, సోమవారాల్లో ఈ శిబిరాలు జరగలేదు. తిరిగి మంగళవారం పునఃప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో తొలి రోజు సేవలందించారిలా..

వైద్య శిబిరాలు	17
అర్బన్ సెంటర్లు	1 (21 సచివాలయాలు)
రూరల్ సెంటర్లు	16
సేవలందించిన స్పెషలిస్ట్ డాక్టర్లు	134
వైద్య పరీక్షలు చేయించుకున్న వారు	8,536
పంపిణీ చేసిన ఔషధ కిట్లు	8,536
జిల్లాలో నిర్వహించే మొత్తం వైద్య శిబిరాలు	383
అర్బన్	15
గ్రామీణ ప్రాంతాలు	368

చీకటి జీవితంలో వెలుగులు నింపారు



కొంత కాలం నుంచి కళ్లు కనిపించడం లేదు. కనీసం నా పనులు కూడా నేను చేసుకోలేకపోతున్నాను. పట్టణానికి వెళ్లి వైద్యం చేసుకునే స్తోమత లేక దేవుడే దిక్కు అని ఇంటి వద్దనే ఉండిపోయాను. కంటి చూపు లేకపోతే జీవితమే నరకంగా మారింది. ఎవరైనా సాయం చేస్తారా అని ఎదురు చూస్తున్నాను. ఇంతలో జగనన్న ఆరోగ్య సురక్ష పెడుతున్నారని చుట్టుపక్కల వారు చెప్పారు. మా వలంటీరు వచ్చి, కంటి పరీక్షలు పెడుతున్నారని చెప్పడంతో శిబిరం వద్దకు వెళ్లాను. పరీక్షలు చేసి కంటి అరుకు, మందులు ఇచ్చారు. త్వరలో కళ్లజోడు కూడా ఇస్తామని చెప్పారు. ఒకరకంగా నాకు పునర్జన్మ ఇచ్చారు.

– పి.అప్పయ్యమ్మ, చిట్యాల, గోపాలపురం

క్లుప్తంగా

ఆదిత్య విద్యార్థికి భారీ ప్యాకేజీ


కృష్ణారెడ్డి

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య కళాశాలల విద్యార్థి పడాల కృష్ణారెడ్డి రూ.28.95 లక్షల వార్షిక ప్యాకేజీతో జపాన్‌లో ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాలల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. తమ విద్యాసంస్థలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కృష్ణారెడ్డి తొలి అంతర్జాతీయ ప్లేస్‌మెంట్‌లో భాగంగా బీఈఎల్‌టీ జపాన్లో ఉద్యోగం పొందారని తెలిపారు. ఆ విద్యార్థిని ఆదిత్య కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ అకడమిక్స్ ఎస్.రమాశ్రీ, ఎంవీ రాజేష్, సీఈఓ బాబ్జీ నీలం తదితరులు అభినందించారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు


తప్పిపోయిన రామస్వామిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న దృశ్యం

కరప: తప్పిపోయి వచ్చిన ఓ వృద్ధుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించి కరప మండలం గురజనాపల్లిలోని మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజు ఉదారత చాటుకున్నారు. మచిలీపట్నానికి చెందిన సొంటి రామస్వామి తప్పిపోయి కాకినాడ వచ్చాడు. జొన్నలగడ్డ రాజు అతనిని చేరదీసి, భోజనం, వసతి కల్పించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా అతని కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. వైజాగ్‌లో ఉంటున్న బాధితుడి కుమార్తె అనురాధకు ఫోన్‌లో సమాచారం అందించగా సోమవారం కాకినాడ వచ్చారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రామస్వామిని పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కొబ్బరిలో యాజమాన్య పద్ధతులు

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. అక్టోబర్‌లో కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. వర్షాకాలం చివరిలో కొబ్బరి తోటల్లో దుక్కులు బాగా చేసుకోవాలన్నారు. హరిత ఎరువులైన జనుము, పిల్లిపెసర, నత్రజని స్థాపన మొక్కల విత్తనాలను తోటలలో చల్లుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వారానికి ఒకసారి తడులు పెట్టాలన్నారు.

సామర్థ్యాల మదింపు.. ప్రతిభ గుర్తింపు

- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- నవంబర్ 3న పాఠశాలల్లో 'సీస్' సర్వే
- ముందుగా ప్రాక్టీస్ పరీక్షలకు ఏర్పాట్లు



రాయవరం: చదువే అన్నింటికీ మూలం.. అందులో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలం. అందుకే విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది, సమున్నత లక్ష్యంతో ముందుకు సాగేలా విద్యా వ్యవస్థలో నిరంతరం కసరత్తు జరుగుతోంది. విద్యార్థి తరగతి వారీగా అభ్యసన సామర్థ్యాలు సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సరికొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి నాస్ సర్వే నిర్వహిస్తుండగా, చివరగా 2021లో చేశారు. తిరిగి 2024లో నిర్వహించనున్నారు. నాస్ సర్వేకు ముందుగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే మండల స్థాయిలో సర్వే చేపట్టనున్నారు. ఈ సీస్ సర్వే నవంబర్ 3న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. అదే సమయంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేయవచ్చు. ప్రతి మూడేళ్లకు ఒకసారి ఈ సర్వే జరుగుతోంది. తదనుగుణంగా విద్యా వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తెచ్చేందుకు అవకాశం ఏర్పడుతోంది.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపికకు కసరత్తు

సీస్ సర్వేలో భాగంగా క్షేత్ర స్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు ఆయా మండలాలకు ఎంత మంది ఎఫ్ఐలు అవసరమనేది విద్యాశాఖ నిర్ధారణకు వచ్చింది. ఇప్పుడు ఎఫ్ఐలుగా ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులను నియమించి, వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సర్వే నిమిత్తం నిర్వహించే పరీక్ష వీరి పర్యవేక్షణలో జరుగుతుంది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్షా ఏఎంవో, డైట్ ప్రిన్సిపాల్/లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఈ పరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా మండల విద్యాశాఖాధికారులు 1, 2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు వ్యవహరిస్తారు. ఈ పరీక్షకు ముందుగా విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంది. గతంలో నిర్వహించిన సర్వేలో భాగంగా మూడు, ఐదు, ఎనిమిది తరగతులకు పరీక్షలు నిర్వహించగా, ఈ ఏడాది సీస్ సర్వేలో మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లోనే ఈ పరీక్షలు జరుపుతారు. వీటి నిర్వహణకు ముందుగా విద్యార్థులకు ప్రాక్టీస్ పేపర్లను కూడా ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసింది. విద్యార్థులకు ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదునివ్వడం ద్వారా సీస్ పరీక్షను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశముంటుంది. పూర్తిగా ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. మూడు, ఆరు తరగతుల విద్యార్థులకు తెలుగు/ ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతికి తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు.

సర్వేలో ముఖ్యాంశాలివీ..

ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో సర్వే నిర్వహిస్తారు. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష ఉంటుంది. 3వ తరగతి విద్యార్థులకు మూడో తరగతి సిలబస్‌పై, 6వ తరగతికి ఐదో తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. 3, 6 తరగతుల విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో పరీక్ష చేపడతారు. 3, 6 తరగతుల విద్యార్థులకు 40 ప్రశ్నలు 60 నిమిషాల్లో రాయాలి. 9వ తరగతి విద్యార్థులు 60 ప్రశ్నలకు 90 నిమిషాల్లో పరీక్ష రాయాలి. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ లెవల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో శిక్షణనిస్తారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు విద్యార్థులు, స్కూల్, టీచర్ ప్రశ్నావళిని ఇచ్చి సమాధానాలు రాయించాల్సి ఉంటుంది. సమాధానాలు ఓఎంఆర్ షీట్‌లో రాయాలి. ప్రతి శనివారం ఆయా యాజమాన్యాలు విద్యార్థులకు ప్రాక్టీస్ టెస్టులు నిర్వహిస్తే విద్యార్థులు సులువుగా పరీక్ష రాసేందుకు వీలవుతుంది.

సర్వే ఎలా చేస్తారంటే..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 976 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, తూర్పుగోదావరి జిల్లాలో 926, కాకినాడ జిల్లాలో 1,013 పాఠశాలలు ఉన్నాయి. ఆయా జిల్లాల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) పేరుతో సర్వే చేపట్టనున్నారు. సర్వేలో భాగంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పరీక్ష ద్వారా మదింపు చేయనున్నారు. ఇందుకు పక్కాగా పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో విద్యా శాఖ నిమగ్నమైంది. పరీక్ష నిర్వహణకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు (ఎఫ్ఐ)లను ఎంపిక చేయనున్నారు. కోనసీమ జిల్లాకు డైట్, బీఎడ్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ విద్యాభ్యాసం చేస్తున్న 1,075 మంది ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యవేక్షకులు (ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్)గా నియమించనున్నారు. అలాగే కాకినాడ జిల్లాకు 1,116, తూర్పుగోదావరి జిల్లాకు 1,020 మందిని ఎంపిక చేస్తారు.



సమర్థవంతంగా నిర్వహిస్తాం



సీస్ సర్వేలో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్ఐ) నియామకానికి కూడా చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే ఎఫ్ఐలకు శిక్షణనిస్తాం.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

అవగాహన అంచనాకు..



నాస్, సీస్ సర్వేల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపు జరుగుతుంది. విద్యార్థుల్లో అవగాహనా శక్తిని అంచనా వేసేందుకు సర్వే ఉపకరిస్తుంది. సర్వే ఫలితాలను బట్టీ తగిన బోధనాభ్యసన ప్రణాళికలను రూపొందిస్తారు. సర్వేను జిల్లా కమిటీ పర్యవేక్షిస్తుంది.

–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

చాట్ బాట్‌తో 106 సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీధర్


రికవరీ చేసిన సెల్ ఫోన్‌ను బాధితునికి అందజేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా

అమలాపురం టౌన్: జిల్లాలో చోరీకి గురైన, పోగొట్టుకున్న ఫోన్లను చాట్ బాట్ విధానం ద్వారా జిల్లా పోలీసులు గుర్తించి రూ.17.20 లక్షల విలువైన 106 ఫోన్లు రికవరీ చేశారు. ఈ ఫోన్లను స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ చేతుల మీదుగా బాధితులకు సోమవారం అందజేశారు. చాట్ బాట్ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన ఆరు నెలల్లోనే జిల్లా పోలీసు శాఖ ఇప్పటి వరకూ నాలుగు విడతల దర్యాప్తులు, విచారణలతో మొత్తం 504 ఫోన్లను రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితులకు అందజేసింది. మొదటి విడతలో 85, రెండో విడతలో 168, మూడో విడతలో 145, నాలుగో విడతలో 106 ఫోన్లను రికవరీ చేసింది. మొత్తం నాలుగు విడతల్లో రూ.80 లక్షల విలువైన 504 ఫోన్లను పోలీసులు రికవరీ చేసి చాట్ బాట్ సద్వినియోగంలో ముందున్నారు. బాట్ ద్వారా ఎఫ్ఐఆర్‌లు లేకుండానే, పోలీస్ స్టేషన్లకు వెళ్లే పనిలేకుండా చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న ఫోన్లను తక్కువ వ్యవధిలోనే అందిస్తున్న తీరుపై బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ పోగొట్టుకున్న ఫోన్ సాంకేతిక వివరాలు, చిరునామా వంటి సమాచారాన్ని చాట్ బాట్ ద్వారా ఫిర్యాదు చేయడంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. దీనికోసం నిర్దేశించిన పోలీస్ '85229 13300' వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్‌బీ సీఐ బి.రాజశేఖర్, సీసీఎస్ సీఐ బి.తిరుపతిరావు, క్రైమ్ ఎస్సై సంపత్ కుమార్, ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, క్రైమ్ విభాగం హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన ఉండూరు

వ్యక్తి దారుణ హత్య


సుబ్రహ్మణ్యం (ఫైల్)


ఉండూరు ధర్మతేజ లేఅవుట్‌లో సుబ్రహ్మణ్యం మృతదేహం

సామర్లకోట: ప్రశాంతంగా ఉండే ఉండూరు ఒక్కసారిగా ఉలిక్కిపడింది.. ఓ వ్యక్తి దారుణ హత్య కలకలం సృష్టించింది.. మండలంలోని ఉండూరు శివారు ప్రకాశరావుపేటలోని ధర్మతేజ లేఅవుట్‌లో అదే గ్రామానికి చెందిన కొత్తెం సుబ్రహ్మణ్యం (35) హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తాపీ పనులకు వెళ్లి జీవనం సాగించే సుబ్రహ్మణ్యానికి మద్యం తాగే అలవాటు ఉంది. అతనికి పెళ్లి కాకపోవడంతో తల్లి సావిత్రి వద్ద ఉంటున్నాడు. సుబ్రహ్మణ్యం అన్న, అక్కలకు వివాహాలు కావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ప్రజల సమాచారం మేరకు సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్ సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి ధర్మతేజ లేఅవుట్‌లో సుబ్రహ్మణ్యంతో పాటు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి మద్యం తాగి ఘర్షణ పడినట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతని తలపై బలమైన గాయాలు ఉండటంతో హత్య కేసుగా నమోదు చేశారు. స్థానికుల అనుమానం మేరకు డాగ్ స్క్వాడ్ గుర్తించిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి విచారిస్తున్నారు. నిందితుడు మద్యం మత్తులో ఉండి ఏమీ చెప్పడం లేదని సీఐ వివరించారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వైనాట్' వెంకట్రాయుడికి అవార్డు


నటి మెహ్రీన్ కౌర్ పిర్జాద చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట్రాయుడు దంపతులు

తణుకు: రాష్ట్రంలో ఉత్తమ ఎలక్ట్రానిక్స్ అండ్ హోమ్ అప్లయన్సెస్ స్టోర్‌గా 2022–23 సంవత్సరానికి అవార్డు అందుకున్నట్లు తణుకు పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్ అధినేత జుజ్జువరపు వెంకట్రాయుడు తెలిపారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నటి మెహ్రీన్ కౌర్ పిర్జాద చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖపట్టణంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాల అమ్మకాలు, విక్రయానంతర సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు అందుకున్నట్లు వివరించారు.

ఎన్ఐఏ సోదాలు

- రాజమహేంద్రవరం, కొవ్వూరు, అమలాపురంలో కలకలం
- పౌరహక్కుల నేతల ఇళ్లల్లో తనిఖీలు


కొవ్వూరులో శ్రీమన్నారాయణ ఇంటి వద్ద ఎన్ఐఏ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్/కొవ్వూరు: కేంద్ర దర్యాప్తు సంస్థ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) బృందాలు సోమవారం రాజమహేంద్రవరం నగరం, కొవ్వూరు పట్టణాల్లో ఆకస్మికంగా సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. బొమ్మూరులోని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) నాయకుడు కోనాల లాజర్ ఇంట్లో ఎన్ఐఏ బృందం ఉదయం 5.30 గంటల నుంచి తనిఖీలు చేపట్టింది. లాజర్ హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి కావడంతో తెల్లవారుజామున డ్యూటీకి వెళ్లారు. ఈలోగా ఎన్ఐఏ అధికారులు లాజర్ ఇంట్లో విస్తృత సోదాలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటల సమయంలో డ్యూటీ నుంచి వచ్చిన లాజర్‌ను వారు ప్రశ్నించారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయా, ఇతర కార్యకలాపాలేమిటో ఆరా తీశారు. తాను ప్రజల సమస్యలపై వివిధ సంఘాలతో కలిసి ఉద్యమాల్లో పాల్గొంటానే తప్ప మావోయిస్టులతో ఎలాంటి సంబంధాలూ లేవని లాజర్ స్పష్టం చేశారు. సోదాల అనంతరం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో లాజర్ ఫోన్‌లోని రెండు సిమ్‌లను, కేఎన్‌పీఎస్ కరపత్రాలను, వివిధ పుస్తకాలను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసు అందించారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారన్న ఆరోపణల పైనే ఈ సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. తాను ఇంట్లో లేని సమయంలో తన భార్యా పిల్లలను కనీసం బాత్‌రూమ్‌కు కూడా వెళ్లనీయకుండా ఎన్ఐఏ అధికారులు అడ్డుకోవడం దారుణమని లాజర్ అన్నారు. తాను సాధారణ గ్రేడ్–3 కార్మికుడినని, తన ఇంట్లో అకారణంగా తనిఖీలు చేయడం అప్రజాస్వామికమన్నారు. నిత్యం ప్రజల సమస్యలపై పోరాడే తమపై సోదాల పేరుతో వేధించడం దారుణమన్నారు. తన భార్య గుండె ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటోందని, అందువలన ఈ నెల 19న రావడం వీలు కాదన్నానని చెప్పారు. లాజర్‌కు న్యాయవాదులు ముప్పాళ్ల సుబ్బారావు, పరమట గణేశ్వరరావు, వేడంగి చిట్టిబాబు, ఇసుకపట్ల రాంబాబు, వెంకటరత్నం, సీఐటీయు నాయకులు ఎస్ఎస్ మూర్తి తదితరులు మద్దతు తెలిపారు.

ఐఎల్‌టీడీ ప్రాంతంలో..


కోనాల లాజర్ బైక్‌ను తనిఖీ చేస్తున్న ఎన్ఐఏ అధికారి

రాజమహేంద్రవరం ఐఎల్‌టీడీ జంక్షన్ రైతుబజార్ వెనుక బొగ్గులదిబ్బ ప్రాంతంలో నివాసం ఉంటున్న శ్రీ చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.రమ ఇంట్లో కూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. ఆ సంఘానికి సంబంధించిన వాటితో పాటు పలు పాటల పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు.

కొవ్వూరులో..

కొవ్వూరుకు చెందిన పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ ఇంట్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. అక్కడ నిషేధిత సాహిత్యం, ఎటువంటి ఆధారాలూ లభ్యం కాలేదు. శ్రీమన్నారాయణ ఫోన్‌ను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ముద్దాయిల తరఫున, గురజాల కేసులను తాను హైకోర్టులో వాదిస్తున్నట్లు శ్రీమన్నారాయణ తెలిపారు. న్యాయవాదినైన తన ఇంట్లో సోదాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించానన్నారు. తాము సోదాలు మాత్రమే చేస్తామని, దర్యాప్తు వేరే అధికారులు చేస్తారని ఎన్ఐఏ అధికారులు చెప్పారన్నారు. న్యాయస్థానం సూచనల ప్రకారం ఫోన్ స్వాధీనం చేసుకోరాదని చెప్పినప్పటికీ ఎన్ఐఏ అధికారులు పట్టించుకోలేదన్నారు. పౌర హక్కుల కార్యకర్తగా, సామాజిక ఉద్యమకారుడిగా ప్రజల హక్కులపై మాట్లాడటం తన వృత్తిలో భాగమన్నారు. ఇది నేరమెలా అవుతుందని ప్రశ్నించారు. తనకు 160 సీఆర్‌పీసీ సెక్షన్ కింద నోటీసులు ఇచ్చి ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో హాజరు కావాల్సిందిగా ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారని శ్రీమన్నారాయణ తెలిపారు.

మానవ హక్కుల నేత ఇంట్లో..

అమలాపురం టౌన్: అమలాపురం గోపాలకృష్ణ వీధిలో నివాసం ఉంటున్న రాష్ట్ర మానవ హక్కుల సంఘం కార్యదర్శి యేడిద రాజేష్ ఇంట్లో హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఢిల్లీ ఎన్ఐఏ అధికారుల ఆదేశాలతో హైదరాబాద్ అధికారులు స్థానికంగా మధ్యవర్తుల సహకారంతో కొద్దిసేపు విచారణ చేశారు. ఓ కేసుకు సంబంధించి దేశ వ్యాప్తంగా 47 ఫోన్లు నంబర్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించడం (ట్రేస్ అవుట్)లో భాగంగా అమలాపురంలో రాజేష్‌ను విచారించారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో, ఇద్దరి మధ్యవర్తుల సమక్షంలో విచారణ నిర్వహించారు. అయితే రాజేష్ వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో ఎన్ఐఏ అధికారులు వెనుదిరిగారు. అయినప్పటికీ హైదరాబాద్ ఎన్ఐఏ కార్యాలయానికి ఓసారి వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు రాజేష్‌కు చెప్పినట్లు సమాచారం.

వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి పరీక్షలు

డీఆర్‌ఓ నరసింహులు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ నరసింహులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఏపీపీఎస్సీ ద్వారా వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ద్వారా ఏపీ ఫారెస్ట్ సర్వీస్, రవాణా శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి ఈ నెల 3, 4, 5, 6 తేదీల్లో రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో, ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం నుంచి 6 వరకూ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫోటో గుర్తింపు కార్డుతో పరీక్ష ప్రారంభించడానికి అర గంట ముందే కేంద్రానికి రావాలన్నారు. ఉదయం పరీక్ష 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 8 నుంచి అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం పరీక్ష 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని, అభ్యర్థులను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి అనుమతిస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఏపీపీఎస్సీ ప్రతినిధులు ఎస్వోలు జె.యశోద, టి.వెంకటరమణ, ఏఎస్వో కేఎస్ఎస్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.